
# నాన్ డిటెన్షన్ రద్దు లాభమా.. నష్టమా?

- రాష్ట్రంలో ఈ విధానం అమలయ్యేనా?
- ఉపాధ్యాయ సంఘాల్లో భిన్నాభిప్రాయాలు
- 2018లో తిరస్కరించిన బీఆర్ఎస్ సర్కారు

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : పాఠశాల విద్యలో నాన్ డిటెన్షన్ విధానం రద్దు లాభమా..? నష్టమా..? అన్న చర్చలు సాగుతున్నాయి. కొందరు ఈ విధానాన్ని స్వాగతిస్తుండగా, మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. ఈ విధానం రాష్ట్రంలో అమలవుతుందా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాన్ డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేసి, డిటెన్షన్ విధానాన్ని 2018లోనే కేంద్రం తీసుకొచ్చింది. ఈ ప్రతిపాదనను గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యతిరేకించింది. తాజాగా కేంద్రం విధానపరమైన నిర్ణయాన్ని తీసుకుంది. గెజిట్‌ను సైతం జారీచేసింది. విద్యాశాఖ మంత్రిగా సీఎం రేవంత్‌రెడ్డియే కొనసాగుతున్నారు. ఇప్పటికే కేంద్రం తీసుకొచ్చిన అనేక సంస్కరణలను అమలుచేస్తున్నారు. మరీ ఈ నిర్ణయాన్ని అమలుచేస్తారా.. లేదా? అన్నది సందేహంగా మారింది. ఈ విధానాన్ని ప్రస్తుతం సైనిక్‌స్కూళ్లు, కేవీలు, జవహర్ నవోదయ వంటి కేంద్ర ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అమలుచేస్తామని కేంద్రం ప్రకటించింది. ఆ తర్వాత రాష్ట్రాల్లోనూ ఈ విధానాన్ని అమలు చేసే యోచనలో కేంద్రముంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేస్తున్నాయి. ఈ విధానంతో లాభం జరుగుతుందని, విద్యార్థులను గాడిన పెట్టే అవకాశముంటుందని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ అభిప్రాయపడ్డారు. పాఠశాలలో అభ్యసన సంక్షోభంలో ఉందని, ఈ సంక్షోభం నుంచి డిటెన్షన్ విముక్తి కల్పిస్తుందని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్లానింగ్ అండ్ అడ్మినిస్ట్రేషన్(నేపా) అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పారిపల్లి శంకర్ అభిప్రాయపడ్డారు. ఫెయిల్ అయితే మళ్లీ పరీక్షలకు సన్నద్ధం చేయవచ్చని, అంతిమంగా విద్యార్థికే లాభం జరుగుతుందని పేర్కొన్నారు. నో డిటెన్షన్ విధానం రద్దుతో డ్రాపౌట్స్ పెరుగుతాయని టీఎస్ యూటీఎఫ్ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని తిరస్కరించాలని రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్ చేశారు.



# ఎట్టకేలకు లాభాలు

**కోలుకున్న స్టాక్ మార్కెట్లు • సెన్సెక్స్ 499, నిఫ్టీ 166 పాయింట్లు వృద్ధి**

ముంబై, డిసెంబర్ 23: దేశీయ స్టాక్ మార్కెట్లు ఎట్టకేలకు కోలుకున్నాయి. గత వారం మొత్తంగా నష్టాల్లోనే కొట్టుమిట్టాడిన సూచీలు.. ఈ వారాన్ని లాభాలతో ప్రారంభించాయి. సోమవారం ఉదయం ఆరంభం నుంచే మదుపరులు పెట్టుబడులకు పెద్దపీట వేశారు. దీంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 498.58 పాయింట్లు లేదా 0.64 శాతం పుంజుకొని 78,540.17 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 876.53 పాయింట్లు ఎగబాకింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 165.95 పాయింట్లు లేదా 0.70 శాతం ఎగిసి 23,753.45 వద్ద స్థిరపడింది. దీంతో 5 రోజుల వరుస నష్టాలకు తెరపడినట్లైంది.

### మెరిసిన బ్యాంకింగ్ షేర్లు

బ్యాంకింగ్ రంగ షేర్లు మెరిశాయి. మదుపరులను అమితంగా ఆకట్టుకోవడంతో ఈ ఇండీసెస్ 1 శాతం పెరిగింది. మెటల్, చమురు-గ్యాస్ రంగాల షేర్లూ ఎగిశాయి.

### శనివారమైనా.. బడ్జెట్ రోజున ట్రేడింగ్

వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అయితే ఇది శనివారం అవుతున్నది. సాధారణంగా శని, ఆదివారం దేశీయ స్టాక్ మార్కెట్లకు సెలవు దినాలు. కానీ ఫిబ్రవరి 1 శనివారమైనా.. దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన వార్షిక బడ్జెట్ ప్రకటించనుండటంతో ఆ రోజున మార్కెట్లు ఎప్పట్లాగే ట్రేడ్ అవుతాయని అటు బీఎస్ఈ, ఇటు ఎన్ఎస్ఈ వర్గాలు సోమవారం స్పష్టం చేశాయి. ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 3:30 వరకు ట్రేడింగ్ ఉంటుందని ఓ సర్క్యులర్‌లో పేర్కొన్నాయి. కాగా, గతంలో 2015 ఫిబ్రవరి 28, 2020 ఫిబ్రవరి 1ల్లో కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రకటించినప్పుడూ అవి శనివారాలే. అయినా మార్కెట్లు నడిచాయి. 2001లో కేంద్ర బడ్జెట్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే సమయం సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 11 గంటలకు మారిన దగ్గర్నుంచి స్టాక్ మార్కెట్లు బడ్జెట్ ఏ రోజైతే ఆ రోజు తప్పక ట్రేడింగ్‌ను జరుపుతూ వస్తున్నాయి.

## కూతురిపై తండ్రి లైంగిక దాడి

**ఏడాది తరువాత వెలుగులోకి..**

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 23 : ఓ తండ్రి కన్న కూతురిపైనే లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో ఏడాది క్రితం జరగ్గా సోమవారం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి హైదరాబాద్‌లో ఫుట్‌పాత్ హోటళ్ల వద్ద హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఆ వ్యక్తికి 12 ఏండ్ల కూతురు ఉన్నది. 8 నెలల క్రితం తన భార్యతో గొడవపడటంతో ఆమె కూతురిని తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ వ్యక్తి ఇటీవల అత్తగారింటికి వెళ్లాడు. తండ్రిని చూడగానే కూతురు భయపడిపోయింది. గమనించిన బాలిక అమ్మమ్మ మనుమరాలిని గట్టిగా ప్రశ్నించింది. ఏడాది క్రితం తండ్రి తనపై లైంగిక దాడికి పాల్పడిన విషయాన్ని తెలిపింది. బాధితురాలి తల్లి సోమవారం వన్ టౌన్ పోలీసులకు భర్తపై ఫిర్యాదు చేయగా, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

## బాలుడిపై లైంగికదాడి కేసులో 20 ఏండ్ల జైలు

జగిత్యాల కలెక్టరేట్, డిసెంబర్ 23 : మల్లాపూర్ మండలం సిరిపూర్‌కు చెందిన గోగుల సాయికుమార్ మామిడికాయలు ఇస్తానని ఓ బాలుడికి ఆశచూపి గ్రామ శివారులోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అప్పటి మల్లాపూర్ ఎస్సై పృథ్వీధర్ కేసు నమోదు చేయగా, అప్పటి మెట్‌పెల్లి సీఐ రవికుమార్.. నిందితుడు శ్యాంకుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నేరం రుజువు కావడంతో సాయికుమార్‌కు 20 ఏండ్ల శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ ఫాస్ట్ ట్రాక్ కోర్టు జడ్జి నీలిమ సోమవారం తీర్పునిచ్చారు.

## మే మొదటి వారంలో ఎప్‌సెట్!

- జేఈఈ తర్వాతే పరీక్షలు
- అదే నెలలో అన్ని ప్రవేశ పరీక్షలు
- త్వరలో షెడ్యూల్స్ ప్రకటించనున్న ఉన్నత విద్యామండలి

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే టీజీ ఎప్‌సెట్ పరీక్షలను మే మొదటి వారంలో నిర్వహించే అవకాశముంది. ఇంజినీరింగ్‌కు మూడు రోజులు, ఫార్మసీ, అగ్రికల్చర్‌కు రెండు రోజులపాటు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ సారి కూడా ఎప్‌సెట్ నిర్వహణ బాధ్యతలను జేఎన్టీయూకే అప్పగించారు. జేఎన్టీయూ ప్రొఫెసర్ డీన్‌కుమార్‌ను పరీక్ష కన్వీనర్‌గా ఉన్నత విద్యామండలి నియమించింది. కేవలం పరీక్షల షెడ్యూల్ మాత్రమే విడుదల చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో టీసీఎస్ వర్గాలతో ఉన్నత విద్యామండలి సంప్రదింపులు జరుపుతున్నది. మే రెండో వారంలో ఎప్‌సెట్ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయానికొచ్చారు. పరీక్షా తేదీలను ఖరారుచేసి, పూర్తి షెడ్యూల్‌ను జనవరిలో ప్రకటిస్తారు. జేఈఈ మెయిన్ పరీక్షలు పూర్తయ్యాకే ఎప్‌సెట్ పరీక్షలు నిర్వహిస్తారు. దీంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గే అవకాశాలున్నాయి.

### వ్యవధి 10 రోజులే..

జేఈఈ మెయిన్-2 పరీక్షలు ఏప్రిల్ ఆఖరులో జరగనున్నాయి. అంటే జేఈఈకి ఎప్‌సెట్‌కు మధ్య వ్యవధి 10-15 రోజులే ఉండనుంది. ఇంటర్ పరీక్షలు మార్చి 20తో ముగుస్తాయి. ఇంటర్ పరీక్షల నుంచి ఎప్‌సెట్‌కు మధ్య వ్యవధి 45 రోజులుంటుంది. దీంతో ప్రిపరేషన్‌కు సరిపోయేంత సమయమిచ్చినట్టవుతుందని అధికారులు భావిస్తున్నారు. అయితే బిట్‌శాట్ పరీక్ష సైతం మేలోనే జరగనుంది. ఈ పరీక్ష అడ్డంకిరాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మిగిలిన ప్రవేశ పరీక్షలైన ఐసెట్, పీజీఈసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పీఈసెట్, ఈసెట్ వంటి పరీక్షలను సైతం మే మాసంలోనే నిర్వహించనున్నారు. ఇప్పటికే ఈ ప్రవేశ పరీక్షలను నిర్వహించే వర్సిటీలు, కన్వీనర్ల ఎంపిక పూర్తికాగా, ఈ ఆరు ప్రవేశ పరీక్షల షెడ్యూల్స్‌ను సైతం జనవరిలో ఖరారుచేసే అవకాశాలున్నాయి.

## కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి



దేహశుద్ధి చేస్తున్న కుటుంబసభ్యులు

కురవి, డిసెంబర్ 23 : మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కాంపల్లి శివారు సక్రాంనాయక్ తండా డీఎన్‌టీ ప్రాథమిక పాఠశాలలో డీఎస్ శ్రీనివాస్ ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉపాధ్యాయుడు తనకు సెల్‌ఫోన్‌లో అసభ్యకర వీడియోలు చూపుతూ వికృతంగా ప్రవర్తిస్తున్నట్టు నాలుగో తరగతి బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఎంఈవో లచ్చిరాంనాయక్ ఆదేశాల మేరకు కాంపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం అరుణశ్రీ సక్రాంనాయక్ విచారణ చేపట్టారు. వివరాలను డీఈవో రవీందర్‌రెడ్డికి తెలుపగా కీచక ఉపాధ్యాయుడిని డీఈవో సస్పెండ్ చేశారు.

## వెల్‌వర్క్ కో-వర్కింగ్ సెంటర్

**హైదరాబాద్‌లో ప్రారంభించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**

హైదరాబాద్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో మరో నూతన కో-వర్కింగ్ సెంటర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం ప్రారంభించారు. అమీర్‌పేటలోని వాసవి ఎంపీఎం గ్రాండ్‌లో 5.5 లక్షల చదరపు అడుగుల్లో సుమారు 400 సీట్ల సామర్థ్యంతో తెచ్చిన ఈ కేంద్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్టార్టప్‌లకు ప్రధాన కేంద్రంగా ఉన్న హైదరాబాద్‌లో ప్లగ్ అండే ప్లే కో-వర్కింగ్ డెస్కలను ఏర్పాటు చేసే సంస్థలు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. వాణిజ్యవేత్త గిరీష్ మల్పానీ నెలకొల్పిన 'వెల్‌వర్క్' అనే సంస్థ గచ్చిబౌలిలో ఇప్పటికే ఒక కో-వర్కింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, తాజాగా అమీర్‌పేటలో రెండో దాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. రూ.6 కోట్ల వ్యయంతో దీన్ని ఏర్పాటు చేశారు.

# మళ్లీ రూపాయి డౌన్

**7 పైసలు దిగజారి 85.11 వద్దకు పతనం**



ముంబై, డిసెంబర్ 23: దేశీయ కరెన్సీ రూపాయి విలువ మళ్లీ పడిపోయింది. గత వారం ఆల్‌టైమ్ కనిష్ఠానికి దిగజారిన రూపీ.. ఆ తర్వాత బాగానే కోలుకున్నట్టు కనిపించింది. కానీ సోమవారం తిరిగి నష్టాల్లోకి జారుకున్నది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ వద్ద డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ 7 పైసలు క్షీణించి 85.11 వద్ద ముగిసింది. శుక్రవారం 9 పైసలు కోలుకోగా.. అంతకుముందు రోజు గురువారం 19 పైసలు కోల్పోయి మునుపెన్నడూ లేని విధంగా తొలిసారి 85.13 వద్దకు మారకపు విలువ పతనం కావడం గమనార్హం. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వచ్చే ఏడాది వడ్డీరేట్ల కోతల్ని తగ్గిస్తామని ప్రకటించిన దగ్గర్నుంచి ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్లకు డిమాండ్ మరింతగా పెరిగింది. దేశీయంగానూ దిగుమతిదారుల నుంచి డాలర్లకు పెద్ద ఎత్తున ఆదరణ కనిపిస్తున్నది. ఫలితంగా డాలర్ ముందు రూపాయి ఏమాత్రం నిలువలేకపోతున్నదని ఫారెక్స్ ట్రేడర్లు చెప్తున్నారు. అలాగే భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, గ్లోబల్ మార్కెట్‌లో పెరుగుతున్న ముడి చమురు ధరలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయంటూ తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. నిజానికి ఉదయం 85.02 వద్దే మొదలైనా.. ఆఖర్లో మాత్రం ఇంకా రూపీ నేలచూపులు చూసింది.



*హోండా (హెచ్ఎంఎస్ఐ) సంస్థ దేశీయ మార్కెట్‌లోకి సరికొత్త ఎస్‌పీ125 బైక్‌ను తీసుకొచ్చింది. డ్రమ్, డిస్క్ వేరియంట్లలో ఈ టూవీలర్ పరిచయమవగా, ఢిల్లీ ఎక్స్‌షోరూం ప్రకారం డ్రమ్ వేరియంట్ ధర రూ.91,771గా, డిస్క్ వేరియంట్ రేటు రూ.1,00,284గా ఉన్నాయి. ఆధునిక ఫీచర్లతో వచ్చిన ఈ బైక్‌లు ఐదు కలర్లలో లభించనున్నాయి.*

## ఇక వాయిస్, ఎస్ఎంఎస్‌లకు ప్రత్యేక ప్లాన్లు: ట్రాయ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: ఫీచర్ ఫోన్ యూజర్లు, వయో-గ్రామీణ కస్టమర్లను దృష్టిలో పెట్టుకొని టెలికం రెగ్యులేటర్ ట్రాయ్.. సోమవారం టారిఫ్ రూల్స్‌ను సవరించింది. దీంతో ఇకపై వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌లతో కూడిన రిచార్జ్ వోచర్లను టెలికం సంస్థలు తప్పక అందుబాటులోకి తేవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ వినియోగదారులే లక్ష్యంగా రకరకాల డాటా ప్లాన్లను టెలికం కంపెనీలు పరిచయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ బండిల్డ్ ప్లాన్లలోనే అపరిమిత వాయిస్ కాల్స్‌ను, రోజుకిన్ని (100) ఎస్ఎంఎస్‌ల సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి. అయితే డాటా వాడుకోని కస్టమర్లకు ఈ ప్లాన్లు భారంగా పరిణమించాయి. కాగా, రూ.10తోపాటు ఇతర డినామినేషన్లలో వాయిస్, ఎస్ఎంఎస్ వోచర్లనూ కొనసాగించాలని కంపెనీలకు ట్రాయ్ సూచించింది.





## నిస్సాన్, హోండా ఒక్క గూటికి

**ఎంవోయూ కుదుర్చుకున్న జపాన్ కంపెనీలు**

టోక్యో, డిసెంబర్ 23: జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటో రంగ సంస్థలు హోండా, నిస్సాన్ ఒక్కటవుతున్నాయి. తాజాగా ఇరు కంపెనీలు ఓ అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. ఈ రెండింటి కలయికతో ఏర్పడబోయే కొత్త సంస్థ.. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆటో రంగ సంస్థ కానున్నది. వాహన అమ్మకాలపరంగా టయోటా, ఫోక్స్‌వాగన్‌ల తర్వాత హోండా-నిస్సాన్‌ల కంపెనీయే నిలువబోతున్నది. ప్రస్తుతం మూడో స్థానంలో హ్యుందాయ్-కియా గ్రూప్ ఉన్నది. 2026 ఆగస్టుకల్లా ఈ విలీనం పూర్తికావచ్చన్న అంచనాలున్నాయి. కాగా, ఈ మెగా విలీనంలో మిట్సుబిషి మోటర్స్ కూడా భాగం కాబోతున్నది. ఈ మేరకు టోక్యోలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్పష్టమైన సంకేతాలొచ్చాయి. మిట్సుబిషిలో నిస్సాన్‌కు మెజారిటీ వాటా ఉన్న విషయం తెలిసిందే. చైనా, అమెరికా మార్కెట్లలో అమ్మకాల క్షీణత నేపథ్యంలో హోండా, నిస్సాన్‌లు విలీనానికి సిద్ధపడడం ప్రాధాన్యాన్ని సంతరించుకున్నది. ఇప్పటికే ఉద్యోగ, ఉత్పత్తిలో కోతలకూ ప్లాన్ వేశాయి.

## అంబేద్కర్‌ను గౌరవించింది బీఆర్ఎస్సే

- అమిత్‌షా వ్యాఖ్యలు బాధాకరం
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మాట్లాడుతున్న పుట్ట మధూకర్

మంథని, డిసెంబర్ 23 : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌ను గౌరవించింది బీఆర్ఎస్సేనని మంథని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఉద్ఘాటించారు. పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌ను కించపరిచేలా కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. మంథని నియోజకవర్గ ప్రజల తరఫున అమిత్ షా వ్యాఖ్యలను ఖండించారు. సోమవారం సాయంత్రం మంథనిలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ ఫొటోలను ప్రదర్శించి నిరసన తెలిపిన అనంతరం ఆయన మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించారని గుర్తు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ అంబేద్కర్‌ను కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నాయని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక అమిత్‌షా మాటలను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారని చెప్పారు. కానీ, నియోజకవర్గంలో మాత్రం కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్‌ను గౌరవించేలా ఎక్కడా నిరసనలు తెలుపకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, ఎక్కటి ఆనంతరెడ్డి, నూనె కుమార్ పాల్గొన్నారు.

### సైబర్ నేరగాళ్ల మోసం

జూలపల్లి, డిసెంబర్ 23 : కాచాపూర్‌లో సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి ఇద్దరు అమాయకులు బ్యాంక్ ఖాతాల నుంచి రూ.83 వేలు పోగొట్టుకున్నారు. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పల్లె సంజీవ్, సందనవేని స్వప్నకు పెద్దపల్లిలోని దక్కన్ గ్రామీణ బ్యాంక్‌లో ఖాతాలున్నాయి. సైబర్ నేరగాళ్ల నుంచి వీరిద్దరికి సోమవారం వేర్వేరుగా ఫోన్‌కాల్స్ వచ్చాయి. వెలుగు దీప్తి మండల సమాఖ్య నుంచి కాల్ చేస్తున్నామని నమ్మించారు. మీ బ్యాంక్ వివరాలు చెప్పాలని, మీకు ఆఫీస్ నుంచి రూ.36 వేలు జమ చేస్తున్నామని ఆశ చూపారు. ఈ క్రమంలో అడిగిన వివరాలు వెల్లడించగా సంజీవ్ ఖాతా నుంచి రూ.30 వేలు, స్వప్న ఖాతా నుంచి రూ.53 వేలు తస్కరించారు. డబ్బుల విషయమై బాధితులు తోటి మహిళలతో చర్చించగా, మోసపోయినట్లు తెలిసి నేరగాళ్ల ఫోన్లకు కాల్‌చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. డబ్బులు పోగొట్టుకున్నామని వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి సమాచారమిచ్చారు. జూలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.

### విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

పెద్దపల్లి రూరల్, డిసెంబర్ 23: పెద్దపల్లి మండలంలోని బొంపల్లి పంచాయతీ అనుబంధ గ్రామం మేరపల్లిలో సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒల్లెను రాజమ్మకు పూరిల్లు మంటలు లేచి కాలిపోయిందని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి కే రాజేందర్ తెలిపారు. ఈ ఘటనలో బంగారు ఆభరణాలతోపాటు నగదు కలిపి రూ.2.50 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారని ఫైర్ ఆఫీసర్ కే రాజేందర్ పేర్కొన్నారు. కొంత కాలం క్రితం రాజమ్మ భర్త చంద్రయ్య మృతి చెందగా అప్పటి నుంచి రాజమ్మ ఒక్కతే గుడిసెలో జీవనం సాగిస్తున్నది.

### ఉచిత మధుమేహ పరీక్షలు

రామగిరి, డిసెంబర్ 23 : సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి యువ బలగం ఆధ్వర్యంలో సెంటినరీకాలనీలోని రాణీ రుద్రమదేవి స్టేడియంలో ఉచిత మధుమేహ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఎస్‌వోటూ జీఎం రఘుపతి అతిథిగా హాజరై ప్రారంభించారు. డా.శరణ్య వైద్య పరీక్షలు చేసి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస రెడ్డి, సురేశ్, సంతోష్, శశికుమార్, మారుతి, బెల్లం శ్రీనివాస్ పాల్గొన్నారు.



గోదావరిఖని: వేడుకలో నృత్యాలు చేస్తున్న కళాకారులు

# అట్టహాసంగా సింగరేణి ఆవిర్భావ వేడుకలు

గోదావరిఖని, డిసెంబర్ 23 : సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి స్థానిక జవహర్‌లాల్ నెహ్రూస్టేడియంలో ఆర్జీ-1 ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు అట్టహాసంగా సాగాయి. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సంస్థ ఆవిర్భావ దినోత్సవ కేక్‌కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వేదికపై నిర్వహించిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపచేశాయి. ఇక్కడ స్థానిక మున్సిపల్ కార్పొరేటర్ పెద్దెల్లి తేజశ్రీ ప్రకాశ్, సేవాసమితి అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్, అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు ఉన్నారు.

### సమష్టి కృషితోనే సింగరేణి వెలుగులు : ఆర్జీ1 జీఎం

సమష్టి కృషితోనే సింగరేణి వెలుగులు అని సింగరేణి ఆర్జీ1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. సింగరేణి జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన సింగరేణి ఆవిర్భావ దినోత్సవంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీఎం మాట్లాడారు. ప్రధానంగా దక్షిణ భారతదేశానికి వెలుగునివ్వడంలో సింగరేణీయులందరి భాగస్వామ్యం ఉందని, ఉద్యోగులకు సింగరేణి దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జీఎం సాధించిన బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యం 72మెట్రిక్ టన్నులకు గాను ఇప్పటివరకు 48.03 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించిందన్నారు. ఇక్కడ ఏఐటీయూసీ నాయకులు స్వామి, మడ్డి ఎల్లయ్య, ఆరెల్లి పోశం, సీఎంవోఐ నాయకులు పోనుగోటి శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, ఏరియా ఇంజినీర్ దాసరి వెంకటేశ్వర్‌రావు, డీజీఎం పర్సనల్ అధికారులు కిరణ్‌బాబు, ధనలక్ష్మీబాయి, బంగారు సారంగపాణి, శ్రావణ్‌కుమార్, హన్మంతరావు, తదితరులున్నారు.

యైటింక్లయిన్‌కాలనీ డిసెంబర్ 23 : ఆర్జీ-2 ఏరియాలోని అబ్దుల్ కలామ్ క్రీడా మైదానంలో 136 సింగరేణి ఆవిర్భావ వేడుకలను యాజమాన్యం వైభవంగా ప్రారంభించింది. క్రీడా మైదానాన్ని విద్యుత్ కాంతులతో సుందరంగా తీర్చిదిద్దారు. ముందుగా ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో జీఎం బండి వెంకటయ్య, అధికారులతో కలిసి కేక్ కట్‌చేసి వేడుకలను ప్రారంభించారు. క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో జీఎం పాల్గొని సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించి బెలూన్లను గాలిలోకి వదిలారు. ఏర్పాటు చేసిన సింగరేణి రెస్క్యూ, యంత్రాల నమూనాలు, ఫుడ్, వివిధ రకాల స్టాళ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో రెస్క్యూ జీఎం కాంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌వోటూ జీఎం రాముడు, ఓసీపీ-3 ఏజెంట్ మధుసూదన్ రావు, వీకేపీ ఏజెంట్ నెహ్రూ, డీజీఎం (ప) ఎస్ అనిల్ కుమార్, సివిల్ డీజీఎం ధనుంజయ్, డీజీఎం (ఎ) ఎర్రన్న, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావు, అధికారులు భూక్యా దేశాయి, వేణు, సుభాస్, సునిత, పర్సనల్ అధికారులు వేణుగోపాల్, వంశీధర్,రాజు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి, డిసెంబర్ 23 :సింగరేణి ఆవిర్భావ దినోత్సవాలు అలరించాయి. రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియా ఆధ్వర్యంలో ఉదయం జీఎం కార్యాలయంలో ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు రాణీ రుద్రమదేవి స్టేడియంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావులు సింగరేణి పతాకావిష్కరణ చేసి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా ప్రాంగణంలో వివిధ గనులు, విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ప్రారంభించి తిలకించారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్మిక నాయకులు వైవీ రావు, రాంచంద్రారెడ్డి, కోట రవీందర్, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ, సేవా అధ్యక్షురాలు అలివేణి సుధాకర్ రావు, విజయలక్ష్మీ వెంకటేశ్వర్లు, ఎస్‌వోటూ జీఎంలు రఘుపతి, సత్యనారాయణ, అధికారులు శ్రీనివాసులు, విజయ శేఖర్, నాగేశ్వరరావు, రాజశేఖర్, రాజేంద్రకుమార్, సుదర్శనం, వివిధ గనుల అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.



యైటింక్లయిన్‌కాలనీ : ఆర్జీ-2లో ఓసీపీ నమూనాను పరిశీలిస్తున్న జీఎం



రామగిరి : కార్మికులు రూపొందించిన కన్వేయర్ బెల్టు నమూనాను ఆసక్తిగా తిలకిస్తున్న జీఎంలు

### జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పెద్దపల్లి, డిసెంబర్ 23: గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి, వేతనాలు పెంచాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సీపెల్లి రవీందర్, ఎండీ ఖాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈనెల 27, 28న చేస్తున్న టోకెన్ సమ్మెకు సంబంధించి సోమవారం కలెక్టరేట్‌లో డీపీవో వీరబుచ్చయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

మంథని, డిసెంబర్ 23: మంథనికి చెందిన జేకేఏ షోటోకాన్ కరాటే విద్యార్థులు సీఎం కప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు తెలిపారు. పెద్దపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి సీఎం కరాటే పోటీల్లో సీనియర్స్ విభాగంలో పైడిపాటి బాబీవర్మ, బొడ్డేళ్ల ఇంద్రాణి, తంబూరి రోహిత్‌లు గోల్డ్‌మెడల్స్, జూనియర్స్ విభాగంలో పొట్ల శ్రవణ్ కుమార్, రంగు శ్రీచరణ్ గోల్డ్‌మెడల్స్, క్యాడిట్ విభాగంలో తోట హాసిని, దొంతుల సాయిదివ్య తేజస్విని, బేరా ఆదిత్య తేజ, డుల్గచ్ దేవాన్ష్, గోల్డ్‌మెడల్స్, గట్టు నాగచైతన్య, సోలాంకి నివాస్ సిల్వర్ మెడల్స్ సాధించారు. అదే విధంగా డిసెంబర్ 31 నుంచి జనవరి 1, 2 తేదీల వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలకు ఎంపికైన కరాటే విద్యార్థులను జేకేఏ సౌత్ జోన్ ఇన్‌చార్జి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, పెద్దపల్లి ఎస్జీఫ్ సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్, శంకర్‌గౌడ్ అభినందించారు.